సాక్షి కామారెడ్డి

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



పౌల్ట్రీ రైతు విలవిల

కోడి ధర గణనీయంగా పడిపోవడంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. నెలలో కిలోకు రూ. 29 ధర తగ్గింది.

- 8లో ▸



కుస్తీమే సవాల్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు ప్రాంతాలలో కుస్తీ పోటీలు నిర్వహించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /12.8

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'నేటినుంచి పాఠాలు బోధిస్తాం'

కామారెడ్డి అర్బన్: కొన్ని రోజులుగా చేస్తున్న సహాయ నిరాకరణను ఉపసంహరించుకుంటున్నట్లు పండిత ఉపాధ్యాయ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఈ విషయమై జేఏసీ ప్రతినిధులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్, గఫార్‌శిక్షక్, రవికుమార్, అబ్దుల్ రజాక్, శివశంకర్‌లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇచ్చిన హామీ మేరకు సోమవారం నుంచి ఉన్నత పాఠశాలల్లో 9, 10 తరగతులకు పాఠాలు బోధించాలని రాష్ట్ర జేఏసీ నిర్ణయించిందని పేర్కొన్నారు. సోమవారం నుంచి పాఠాలు బోధిస్తామని తెలిపారు.

రేపు ప్రపంచ మాతృభాషా దినోత్సవం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కళాశాలలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రపంచ మాతృభాషా దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గఫూర్‌శిక్షక్, అల్లి మోహన్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'మాతృభాష ప్రాధాన్యత' అంశంపై చర్చాగోష్ఠి, కవి సమ్మేళనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల కవులు, రచయితలు, భాషాభిమానులు పాల్గొనాలని కోరారు.

రిటైర్డు ఏడీపీ రాజు మృతి



ఎల్లారెడ్డిరూరల్: రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రాజు (70) అనారోగ్యంతో ఆదివారం సికింద్రాబాద్‌లో మరణించారు. ఆయన స్వగ్రామం ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్. 2010లో రిటైరయ్యారు. రాజు అంత్యక్రియలు సోమవారం అన్నాసాగర్ గ్రామ శివారులోని బొగ్గగుడిసె వద్ద జరుగుతాయని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

సెలవులో నగర ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మమత

- టాస్క్‌ఫోర్స్ సీఐ మధుసూదన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మమత సెలవులో వెళ్లారు. ఆమె స్థానంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ మధుసూదన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే టాస్క్‌ఫోర్స్ సీఐగా ఉట్నూరు నుంచి బదిలీపై వచ్చిన మంగమ్మ బాధ్యతలు చేపట్టారు. నగర ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మమత, కానిస్టేబుళ్ల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్న విదితమే. దీంతో పాటు ఎస్‌హెచ్‌వో విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం, కానిస్టేబుళ్లకు విధులు కేటాయించకపోవడం, లిక్కర్ సేల్‌తో పాటు క్రైం డిటెక్షన్ లేకపోవడం ఇలా ఆమె విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. నెలరోజుల క్రితం గుడుంబా కేసులో ఓ మహిళ అరెస్టు కాగా.. ఆమె పారిపోవడంలో ఎస్‌హెచ్‌వో పాత్ర ఉందని ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం డిప్యూటీ కమిషనర్, సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నివేదికను రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు అందించారు. ఈ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటారనే చర్చ జరిగింది. దీంతో ఆమె ముందస్తుగా సెలవులో వెళ్లినట్లు తెలిసింది. ఆమెను బదిలీ చేస్తారనే ప్రచారం ఉంది.

అంతర్జాతీయ సదస్సుకు జీవన్ రావు



డిచ్‌పల్లి: అసోంలోని బోడోలాండ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి మార్చి 2వరకు 'బోడోలాండ్ ఇంటర్నేషనల్ నాలెడ్జి ఫెస్టివల్' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతున్నట్లు రాష్ట్ర అవార్డు గ్రహీత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ అందె జీవన్‌రావు ఆదివారం తెలిపారు. 'దేశీయ విజ్ఞాన వ్యవస్థ' ప్రధాన అంశంగా 'సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థ– ఆవిష్కరణలు మరియు అభ్యాసం' ఉప అంశంగా 'సూపర్‌బ్రెయిన్ యోగా– ఉన్నతమైన మేధస్సుకు మరియు సమాజ క్షేమం కోసం తగిన యోగా' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించి సదస్సులో ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సులో 'సూపర్ బ్రెయిన్ యోగా(గుంజీలు తీయడం) ద్వారా మెరుగైన జ్ఞాపకశక్తి' అనే అంశంపై జీవన్‌రావు ప్రసంగించి పలువురి ప్రశంసలు అందుకున్నారు.

వైకుంఠధామం.. నిరుపయోగం..

కొండాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం..





మంజీర నదిలో ఉన్న మద్దెల్ చెర్వు వైకుంఠధామం



సిర్పూర్‌లో నాణ్యతలోపంతో కుప్పకూలిన శ్మశాన వాటిక

- చాలాచోట్ల నీరు, విద్యుత్ సౌకర్యాలు కరువు
- వినియోగంలోకి రాని శ్మశాన వాటికలెన్నో..
- సొంత స్థలంలోనే దహన సంస్కారాలు

సాక్షి, కామారెడ్డి/నిజాంసాగర్: అంతిమ సంస్కారం గౌరవంగా జరగాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం ఊరూరా వైకుంఠధామాలను నిర్మించింది. చాలాచోట్ల నిర్మాణాలు పూర్తయినా.. కొన్నిచోట్ల మాత్రమే వినియోగంలో ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు ఊరికి దూరంగా ఉండడం, మరికొన్నిచోట్ల సౌకర్యాలు లేకపోవడంతో వినియోగంలో లేవు. చాలావరకు సొంత స్థలాల్లోనే దహన సంస్కారాలు జరుగుతున్నాయి.

జిల్లాలో 526 పంచాయతీలుండగా.. అన్ని గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణాలు చేపట్టారు. కొన్ని పంచాయతీలకు ఈజీఎస్ కింద రూ. 12 లక్షల చొప్పున కేటాయించగా, మరికొన్నింటికి పంచాయతీరాజ్ ద్వారా రూ. 10 లక్షల చొప్పున నిధులు ఇచ్చారు. అయితే ప్రణాళిక లోపంతో కొన్ని గ్రామాల్లో చెరువు శిఖంలో నిర్మించడంతో వర్షాకాలంలో అవి నీట మునుగుతున్నాయి. మరికొన్నిచోట్ల వాగులు, మంజీర నది వెంట నిర్మించారు. వాగుల్లో నీరుంటే అక్కడికి తీసుకువెళ్లే అవకాశం లేదు. డోంగ్లీ మండలంలోని సిర్పూర్‌లో నిర్మించిన వైకుంఠధామం నాణ్యతలోపంతో కూలిపోయింది. పిట్లం మండలంలోని మద్దెల్ చెర్వులో మంజీర నది ఒడ్డున శ్మశానం ని ర్మించారు. నదిలో నీరుంటే శ్మశాన వాటికకు వెళ్లడం కష్టంగా మారుతుంది. దీంతో ఆ గ్రామస్తులు సొంత భూముల్లోనే అంతిమ సంస్కారాలు పూర్తి చేస్తున్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజని, బూర్గుపల్లి, జగన్నాథపల్లి గ్రామాలతో పాటు నిజాంసాగర్, జుక్కల్ మండలాల్లోని పలు గ్రా మాల్లో వైకుంఠధామాలు అసంపూర్తిగా ఉన్నాయి. పనులు నత్తనడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



పెద్దకొడప్‌గల్ మండలంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణం

సౌకర్యాలు లేక..

నిర్మాణం పూర్తయిన వైకుంఠధామాలను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించినా.. ఇప్పటికీ చాలాచోట్ల వాడడం లేదు. వైకుంఠధామాల వద్ద కనీసం నీటి సౌకర్యం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. అంత్యక్రియల ప్రక్రియ పూర్తయిన తర్వాత స్నానాలు చేస్తారు. అలాగే విద్యుత్ సౌకర్యం కూడా లేదు. గ్రామాల్లో వైకుంఠధామాలను వినియోగంలోకి తీసుకురావడానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉంది. వినియోగంలోకి రానివాటిని గుర్తించి, ఎందుకు వినియోగించడం లేదో తెలుసుకుని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బీబీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ప్రతినిధులు



ఘనంగా శివాజీ జయంతి

జిల్లావ్యాప్తంగా ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ర్యాలీలు తీశారు. శివాజీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

– వివరాలు లోపలి పేజీల్లో..



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని కార్యకర్తలు

వల్లభాపూర్‌లో విషాదం

- మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నది నిజామాబాద్ జిల్లానే..

మాక్లూర్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతితో ఆయన స్వగ్రామమైన మాక్లూర్ మండలం వల్లభాపూర్‌లో విషాద ఛాయలు నెలకొన్నాయి. గ్రామంలోని గైని సాయన్న, భూదేవిల ముగ్గురు సంతానంలో సాయన్న ఆఖరివాడు. 1951లో జన్మించారు. ఆయన ఉన్నత చదువు చదివి బ్యాంకు ఉద్యోగం సంపాదించారు. అనంతరం హైదరాబాద్‌లో కులాంతర వివాహం చేసుకున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత వల్లభాపూర్ వచ్చి వివాహం చేసుకున్న విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. 1982లో ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరి కంటోన్మెంట్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. అలా మొ త్తం టీడీపీ హయాంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, టీఆర్ఎస్(బీఆర్ఎస్)లో ప్రస్తుతం కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నా రు. రెండేళ్ల క్రితమే షుగర్ కారణంగా ఒక కా లు తీసేశారు. అప్పటి నుంచి సాయన్న అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోయి మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపా రు. సాయన్నకు భార్య గీత, ముగ్గురు కుమార్తెలు నమ్రత, నందిత, నివేదిత ఉన్నారు. నందిత గతంలో హైదరాబాద్‌లో కార్పొరేటర్‌గా గెలుపొందారు. నివేదిత కూడా బీఆర్ఎస్‌లో చురుకైన నాయకురాలిగా కొనసాగుతున్నారు. వల్లభాపూర్‌లో సాయన్నకు అక్క గైని మలక్కమ్మతో పాటు అన్న కుమారులు, కుమార్తెలు ఉన్నారు. వారు సాయన్న అత్యక్రియల్లో పాల్గొనేందుకు తరలివెళ్లారు.



అటవీ సంరక్షణకు ఫైర్‌లైన్



చిల్లర్గి అటవీ ప్రాంతంలోని బండ్ల బాటలో ఆకులను తగులబెడుతున్న కూలీలు

- అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు
- వన్యప్రాణులు, వృక్షాలను కాపాడడమే లక్ష్యం

నిజాంసాగర్: వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చెట్ల ఆకులు, ఎండిపోయిన పిచ్చిమొక్కలతో వృక్షాలు ఆహుతయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ ప్రమాదంనుంచి అడవులను సంరక్షించుకునేందుకు అటవీ శాఖ చర్యలు చేపట్టింది. కాలిబాటలు, బండ్ల బాటల్లో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తోంది.

జిల్లాలో సుమారు 80 వేల హెక్టారల్లో అటవీ విస్తీర్ణం ఉంది. సాధారణంగా వేసవిలో ఆకులు ఎండిపోయి నేలరాలుతాయి. పశువులను మేపడానికి అటవీ ప్రాంతానికి వెళ్లేవారు బీడీలు తాగినప్పుడు ఆ ఆకులకు నిప్పంటుకుని చెట్లు కాలిపోయే ప్రమాదం ఉంటుంది. అడవుల్లో ఉన్న ఎలుగుబంట్లు, జింకలు, దుప్పులు, నీల్‌గాయ్‌లు, కుందేళ్లు, చిరుతలు, అడవి పందులతోపాటు ఇతరత్రా అడవి జంతువులు చనిపోయే అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో వృక్ష సంపదతోపాటు వన్యప్రాణులను కాపాడుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఫారెస్ట్ రేంజ్‌లు, సెక్షన్లను, బీట్‌ల వారీగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు.

ఫైర్‌లైన్స్ ఏర్పాటు ఇలా..

అటవి ప్రాంతాల్లోని కాలిబాటలకు ఇరువైపులా ఐదు మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేస్తారు. కాలిబాటకు చుట్టు పక్కల ఉన్న ఎండిన ఆకులు, చెత్తాచెదారాన్ని ఈ బాటలో పరిచి నిప్పు పెడతారు. ఆ తర్వాత ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నా ఈ దారుల వరకే మంటలు వ్యాపించి ఆగిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాపించకుండా ఫైర్‌లైన్ అరికడుతుంది. జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు వారం రోజుల నుంచి కూలీలతో ఫైర్‌లైన్ పనులు చేయిస్తున్నారు.

వనాలను కాపాడేందుకు..



చెట్లతో పాటు వన్యప్రాణులను కాపాడుకునేందుకు ఫైర్‌లైన్ పనులు చేపడుతున్నాం. అన్ని ఫారెస్టులలో కూలీల సహాయంతో పనులు చేయిస్తున్నాం. ఎండాకాలంలో అడువులలో మంటలు వ్యాపించినా ఈ ఫైర్ లైన్స్ ఏర్పాటుతో ఎక్కువ ప్రమాదం జరగదు.

– సంజయ్‌గౌడ్, రేంజ్ అధికారి, పిట్లం

బండెక్కితే జేబుకు చిల్లే!

- నో హెల్మెట్ అంటూ జరిమానాలు
- పట్టణవాసులను ఇబ్బంది పెడుతున్న ట్రాఫిక్ రూల్

✤ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసం ఉండే రాజు అనే ఉపాధ్యాయుడు కూరగాయల కోసం డెయిలీ మార్కెట్‌కు వెళ్లాడు. వారం రోజులకు సరిపడా కూరగాయలు కొనుగోలు చేయగా రూ.150 అయ్యాయి. ఇంటికి చేరుకునేలోపు ఆయన ఫోన్‌కు ఓ మెస్సేజ్ వచ్చింది. హెల్మెట్ ధరించనందున రూ.135 జరిమానా పడింది.

✤ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పనిచేసే ఓ వైద్యుడు సిరిసిల్ల రోడ్డులో ఉన్న తన సొంత క్లినిక్‌కు వెళ్లి వస్తుంటాడు. ఆయనకు ధర్మశాల ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా ద్వారా జరిమానాలు పడ్డాయి. ఒక రోజైతే రెండు సార్లు జరిమానా వేశారు. హెల్మెట్ ధరించలేదని పడ్డ ఫైన్లను చూసి షాకయ్యాడు.

✤ కొత్త బస్టాండ్‌కు సమీపంలో జిరాక్సు సెంటర్ నడుపుకునే ఓ వ్యక్తి.. ఎన్జీవోస్ కాలనీ నుంచి రోజూ ఉదయం చర్చి చౌరస్తా మీదుగా షాప్‌నకు వెళతాడు. మధ్యాహ్నం భోజనానికి వెళ్లొస్తాడు. రాత్రికి తిరిగి ఇంటికి చేరుతాడు. హెల్మెట్ ధరించలేదంటూ ఆయనకు పలు మార్లు జరిమానాలు పడ్డాయి.

✤ విద్యానగర్‌లో నివసించే ఓ వ్యాపారి తిలక్ రోడ్డులో ఉన్న తన షాప్‌నకు రోజూ వెళ్లి వస్తుంటాడు. హెల్మెట్ ధరించలేదంటూ పలుమార్లు ఫైన్లు పడ్డాయి. జరిమానాల భయంతో ఆయన రూటు మార్చుకుని కెమెరాకు చిక్కకుండా వెళ్తున్నాడు.

సాక్షి, కామారెడ్డి: జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణం రైల్వేలైను మూలంగా రెండుగా చీలి ఉంటుంది. చాలావరకు దుకాణాలు, వ్యాపారాలు, కూరగాయలు, మాంసం మార్కెట్‌లు పాత పట్టణంలోనే ఉన్నాయి. కొత్త పట్టణానికి చెందిన వారు చాలా మంది పాత పట్టణానికి వెళ్లి వస్తుంటారు. అశోక్‌నగర్, శ్రీరాంనగర్, ఎన్జీవోస్ కాలనీలు, విద్యానగర్, కల్కినగర్, కాకతీయనగర్ తదితర ప్రాంతాలతో పాటు దేవునిపల్లి, లింగాపూర్, టేక్రియాల్ తదితర గ్రామాల ప్రజలు పాత పట్టణంలోని మార్కెట్‌కు వస్తుంటారు. స్థానికంగా ఎవరైనా బైక్‌లపై వేగంగా వెళ్లే పరిస్థితి ఉండదు. ఒకటి రెండు కిలోమీటర్ల దూరానికి హెల్మెట్ ధరించడానికి చాలామంది ఆసక్తి చూపరు. అయితే పోలీసులు మాత్రం 'నో హెల్మెట్' అంటూ రూ.135 చొప్పున ఫైన్లు విధిస్తున్నారు.



కెమెరాలు జరిమానాల కోసమేనా..

జిల్లా కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద హై రిజల్యూషన్ కెమెరాలను పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. వాటిని జిల్లా పోలీసు కార్యాలయంతో అనుసంధానించారు. ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగినా డీపీవోలో ఉన్న స్క్రీన్‌పై కనబడుతోంది. అయితే ఆ కెమెరాలతోనే ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలు విధిస్తున్నారు. పాత బస్టాండ్, చర్చి చౌరస్తా, ఇందిరా చౌక్, నిజాంసాగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో కెమెరాలతో ఈ చలానాలు వస్తున్నాయి. దీంతో పట్టణంలో వివిధ అవసరాల కోసం హెల్మెట్ ధరించకుండా బయటకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట ఫైన్లు పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారంగా మారిన నిబంధనలు

వివిధ అవసరాలకోసం పట్టణవాసులు బైక్‌లపై బయటికి వెళ్లి వస్తుంటారు. నిత్యం పిల్లలను స్కూళ్లు, కాలేజీలలో దింపిరావడం, దుకాణాలకు వెళ్లడం చేస్తుంటారు. కొద్ది దూరానికి హెల్మెట్ ధరించడాన్ని ఇష్టపడరు. అయితే ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాపాయం కలగకుండా హెల్మెట్ ఉపయోగపడుతుందని పోలీసుల పేర్కొంటున్నారు. అందుకే హెల్మెట్ వాడాలని సూచిస్తున్నారు. హెల్మెట్ ధరించనివారికి ఫైన్‌లు వేస్తున్నారు. కానీ లోకల్‌గా తిరిగేటపుడు హెల్మెట్ పెట్టుకుని వెళ్లడం ఇబ్బందికరంగా ఉంటుందని వాహనదారులు పేర్కొంటున్నారు. హెల్మెట్ లేదన్న కారణంతో జరిమానాలు విధించడం నిలిపివేయాలని కోరుతున్నారు.

బీటీ రోడ్డు పరిశీలన..

గాంధారి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం బైక్‌పై కరక్‌వాడి గ్రామానికి వెళ్లారు. ఆయన కొంతకాలం క్రితం కరక్‌వాడి గ్రామాన్ని సందర్శించినప్పుడు ప్రజలు సమస్యలు విన్నవించారు. బీటీ రోడ్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత తొందరగా బీటీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. రోడ్డు వేసిన తర్వాతే గ్రామానికి మళ్లీ వస్తానన్నారు. రూ. 2.73 కోట్లతో గుడిమెట్ నుంచి కరక్‌వాడి – బూర్గుల్ – నంతులు నాయక్ తండావరకు 3.5 కి.మీ. బీటీ రోడ్డు వేయించారు. 92 రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. దీంతో ఆయన ఆదివారం బైక్‌పై ప్రయాణించి రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీటీసీ శంకర్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, మాజీ జెడ్పీటీసీ తానాజీరావు తదితరులు ఉన్నారు.



కరక్‌వాడి గ్రామానికి బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే సురేందర్

సమాజ హితమే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం



సుభాష్‌నగర్: సమాజ హితమే ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ ధ్యేయమని జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ కృష్ణ శాస్త్రి విజయభాస్కర్ అన్నారు. ఆదివారం నగర శివారులోని గూపన్‌పల్లిలో నీలకంఠేశ్వరశాఖ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత ఉపాధ్యాయుడు వెల్మ గంగారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ సంస్కృతీ సంప్రదాయాలను కనుమరు గు కాకుండా చూడాలని, మనమంతా ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఖ్య శిక్షక్ శ్రీనివాస్‌రెడ్డి, భూమేశ్వర్, చంద్రమోహన్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

'జాతీయ స్థాయిలోనూ సత్తాచాటాలి'

కామారెడ్డి అర్బన్: జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలని కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ ఎ.శరత్‌చంద్ర విద్యార్థులకు సూచించారు. కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు వ్యవసాయ విశ్వవిద్యాలయాల జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ క్రీడలలో కళాశాల విద్యార్థులు పల్లవి, అర్చన, కీర్తన, యమున, శ్రీకర్‌రెడ్డి, రంజిత్, సాయిగణేష్, విజయ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని డీన్ శరత్‌చంద్ర తెలిపారు. ఈనెల 20 నుంచి 24 వరకు హర్యానా రాష్ట్రంలో నిర్వహించే వ్యవసాయ విశ్వవిద్యాలయాల జాతీయ స్థాయి క్రీడా పోటీలలో తమ కళాశాల విద్యార్థులు పాల్గొంటాని తెలిపారు. క్రీడాకారులతో పాటు ఫిజికల్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల వ్యవహారాల అధికారులు ఉమాపతి, స్వర్ణలత పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డీన్ శరత్‌చంద్ర

క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



రుద్రూర్: గిట్టుబాటు ధర కల్పించడానికి ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. శనగలు క్వింటాలుకు రూ.5335 మద్దతు ధర ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శంకర్ పటేల్, డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్, వైస్ ఎంపీపీ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ హమీద్, వైస్ చైర్మన్ కల్లూరి రామిరెడ్డి పాల్గొన్నారు.

కవి శ్రీమన్నారాయణకు పురస్కారం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగరానికి చెందిన ప్రముఖ హిందీ కవి శ్రీమన్నారాయణ కావ్య గౌరవ్ అలంకరన్ పురస్కారాన్ని అందుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో 'మాతృభాష ఉన్నయన్ సంస్థాన్' సంస్థ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ విష్ణు సదాశివ కొక్జే, పార్లమెంటు సభ్యుడు శంకర్ లాలవాని శ్రీమన్నారాయణకు పురస్కారాన్ని అందజేశారు. జాతీయ స్థాయిలో విశుద్ధ హిందీ వాచిక సాంప్రదాయన్ని కొనసాగిస్తున్నటువంటి వారిని ఎంపిక చేసి ప్రతీ సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా ఇండోర్‌లో 'కావ్య గౌరవ్ అలంకరన్' పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి





మణెమ్మ(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని లింగంపల్లి కలాన్ సర్పంచ్ నీరుడి మణెమ్మ(66) ఆదివారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమెకు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం గోపాల్‌పేటలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ నారాయణ, ఇతర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామానికి చేరుకొని సర్పంచ్ మణెమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కిరాణ దుకాణంలో అగ్నిప్రమాదం

మాక్లూర్: మాక్లూర్‌లోని హోల్‌సెల్ కిరాణ దుకాణంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నిప్పు అంటుకోవటంతోనే స్థానికులు గమనించి ఆర్పివేశారు. సుమారు రూ: లక్ష నష్టం జరిగినట్టు యజమాని తెలిపారు.

'పది' విద్యార్థులకు స్నాక్స్

- ప్రత్యేక తరగతుల్లో అందజేస్తున్న సర్కార్
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కసరత్తు



గండిమాసానిపేట ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

ఎల్లారెడ్డి: తరగతి గదుల్లో ఆకలితో అలమటిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు శ్రమిస్తున్న ప్రభుత్వ పాఠశాలల పదోతరగతి విద్యార్థుల కడుపు నింపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించేందుకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించనుంది. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీవరకు సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులు కొనసాగనున్నాయి. అయితే ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఆకలితో అలమటించకుండా సాయంత్రం స్నాక్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు సెలవు రోజులు మినహా 34 రోజుల పాటు విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి నిత్యం రూ.15 విలువైన తినుబండారాలు అందజేస్తారు.

కామారెడ్డి జిల్లాలో 191 ప్రభుత్వ పాఠశాలల్లో 191 ప్రభుత్వ పాఠశాలల్లో 7052 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేసి స్పెషల్ టెస్టులను నిర్వహిస్తు 100 శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. స్పెషల్ క్లాసులు డిసెంబర్ 1 నుంచి ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల 45 నిమిషాల వరకు, సాయంత్రం 4 గంటల 45 నిమిషాల నుంచి 6 గంటల వరకు, ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థులు ప్రత్యేక తరగతుల సమయంలో ఆకలితో ఉండద్దని ప్రభుత్వం స్నాక్స్ అందిస్తోంది. ఈ నెల 15 నుంచి రోజూ సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నారు. ప్రతి విద్యార్థికి నిత్యం రూ.15 చొప్పున 34 రోజులకు మొత్తం 7052 మందికి 35,96,520 నిధులను మంజూరు చేసింది. ఈ నిధులను ఆయా పాఠశాలల ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేశారు. స్నాక్స్ అందించడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్నాక్స్ అందించడం సంతోషకరం



స్పెషల్ క్లాసుల సమయంలో ఆకలితో ఇబ్బంది పడేవాళ్లం. ప్రభుత్వం స్నాక్స్ అందించడం సంతోషకరం. దీంతో ఇబ్బంది లేకుండా చదువుకోగలుగుతున్నాం.

– అభిషేక్, పదో తరగతి, గండిమాసానిపేట

చదువుపై దృష్టి పెడుతున్నాం



ఉదయం 8 గంటలకే ప్రత్యేక తరగతులు ప్రారంభం అవుతున్నాయి. సాయంత్రం కూడా ఆరు గంటల వరకు ఉండాల్సి రావడంతో ఆకలి అయ్యేది. సాయంత్రం పూట స్నాక్స్ అందించడంతో చదువుపై దృష్టి పెట్టగలుతున్నాం.

– నరేష్, పదో తరగతి, గండిమాసానిపేట

నిధులు జమ అయ్యాయి

ఎస్‌ఎంసీ ఖాతాల్లో పదో తరగతి విద్యార్థుల స్నాక్స్‌కు సంబంధించిన డబ్బులను జమ చేశాం. ప్రతి రోజు పదో తరగతి విద్యార్థికి రూ.15 విలువ గల స్నాక్స్‌ను అందిస్తున్నాం. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

– రాజు, డీఈవో, కామారెడ్డి

ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో..



శివాజీ వేషధారణలో చిన్నారులు

- బీబీపేటలో శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- ఉచిత అంబులెన్స్ ప్రారంభం
- 150 మంది రక్తదానం

బీబీపేట: ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరుమాండ్లు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాయలం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 150 మంది రక్తదానం చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా రూ.10 లక్షల విలువ గల అంబులెన్స్‌ను అందజేశారు. అంబులెన్స్ లేకపోవడంతో ఆస్పత్రికి సమయానికి చేరుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారని అందజేసినట్లుగా పెరుమాండ్లు తెలిపారు. సాయంత్రం గ్రామంలో వైభవంగా ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. 8 ఒంటెలు, 20 గుర్రాలు, రథంపై శివాజీ విగ్రహం, శివాజీ వేషధారణలో 50 మంది చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. అంతే కాకుండా సుమారు రూ.4 కోట్లతో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రధాన చౌరస్తాలో పెడుతామని పెరుమాండ్లు ప్రకటించారు. ప్రస్తుతం విగ్రహం పూణెలో నిర్మాణంలో ఉందని, సుమారు 4 టన్నులు మట్టితో తయారవుతుందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ విగ్రహం ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఛత్రపతి శివాజీ వంశస్తులు వస్తారని పేర్కొన్నారు.



రక్తదానం చేస్తున్న ప్రజలు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న పెరుమాండ్లు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ఖలీల్‌వాడి: ప్రజల్లో వైఎస్ షర్మిలకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నేతలు ప్రజా ప్రస్థానం పాదయాత్ర అడ్డుకోవాలని చూస్తున్నారని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు బుస్సాపూర్ శంకర్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద పార్టీ నేతలతో కలిసి బీఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆయన దహనం చేశారు. బుస్సాపూర్ శంకర్ మాట్లాడుతూ ప్రశాంతంగా జరుగుతున్న షర్మిల పాదయాత్రను అధికార పార్టీ నేతలు అడ్డుకోవాలని చూసి, యుద్ధ వాతావరణంగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ నాయక్, మౌనిక, అంకార్ గణేష్, కస్తూరి ప్రవీణ్, ఆనంద్, సంతోష్, రవికుమార్, పాండు, దినేష్, స్వప్న, వినోద్ పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌లో జిల్లా వైద్యులకు పతకాలు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి హాఫ్ మారథాన్‌లో జిల్లాకు చెందిన వైద్యులు పతకాలు సాధించారు. ఆదివారం హైద్రాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో 21 కిలోమీటర్ల పరుగుపందెం నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన డాక్టర్ మహేష్ రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచారు. గంట 24నిమిషాల్లో 21కిలో మీటర్ల పరుగు పూర్తి చేశారు. మిగతా వైద్యులు జలగం తిరుపతిరావు, రాఘవేందర్, కిశోర్‌రెడ్డి, మహేష్, అభిషేక్, శ్రీనివాసు, శ్రీనునాయక్ పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించారు. వీరిని ఐఎంఏ అధ్యక్షుడు నీలీరాంచందర్, వైద్యులు అభినందించారు.

పౌల్ట్రీ రైతు విలవిల

- తగ్గిన కోడి ధర
- నెల క్రితం కిలో రూ.107, ప్రస్తుతం రూ.78

బీబీపేట: పౌల్ట్రీ రంగం కుదేలవుతోంది. కోళ్లను నమ్ముకున్న ఫాం యజమానులకు తీరని నష్టం వాటిల్లుతోంది. రోజురోజుకూ కోడి ధర తగ్గుతుండటంతో లబోదిబోమంటున్నారు. దాణా, కోడిపిల్లల ధరలు తగ్గకపోగా విక్రయించే సమయంలో కోడి ధర అమాంతం పడిపోతోంది. ఈ నేపథ్యంలో రైతులు పెట్టిన పెట్టుబడిని పొందకపోగా నష్టాలపాలవుతున్నారు. కోళ్ల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో కార్పొరేట్ శక్తులే శాసిస్తున్నాయి.

నెల రోజుల్లో రూ.29 పతనం

కోళ్ల ఫారం రైతులకు, వినియోగదారులకు కోడి ధరలో తేడా ఉంది. ట్రేడర్లు, చికెన్ సెంటర్లకు లాభాలు పోనూ వినియోగదారుని ధరను నిర్ణయిస్తారు. గత నెల 17 వరకు కోడి కిలో ధర ఫారం రేట్ రూ.107 ఉండగా ప్రస్తుతం రూ. 78కి చేరింది. అంటే రూ.29 తగ్గింది. ఒక కోడిని పోషించేందుకు రూ.200 పైగా ఖర్చు అవుతోందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుత ధరతో కోడికి రూ.172 మాత్రమే వస్తుండగా రూ. 28 నష్టం వస్తోంది. ఈ లెక్కన ఐదు వేల కోళ్ల ఫారంలో రూ.1.40 లక్షల వరకు నష్టం వస్తోందని రైతులు వాపోతున్నారు.

తగ్గని దాణా రేట్లు

బాయిలర్ కోళ్ల పరిశ్రమ నెల రోజులుగా పౌల్ట్రీ రైతులను కష్టాల్లోకి నెడుతోంది. కోడిపిల్లను రూ. 25 నుంచి రూ.30 వరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మొక్కజొన్న ధరలు, సోయాబీన్ ధరలు తగ్గినా దానా ధరలు మాత్రం తగ్గించడం లేదు. అంతే కాకుండా కోడి పిల్ల దశ నుంచి అమ్మే వరకు 45 రోజుల్లో మూడున్నర కిలోల దాణా ఆహారంగా తీసుకుంటుంది. అంటే దాదాపు రూ.180 వరకు ఆహారం తీసుకుంటుంది. ఉనుక, వైద్యం, విద్యుత్, పనిచేసేవాళ్లతో కలిపి ఒక్కో కోడి పెంపకానికి రూ. 200 పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఇక కోళ్లను విక్రయించే సమయంలో పేపర్ రేట్ రూ.78 ఉండగా మైనస్ రూ.10 నుంచి రూ.12 వరకు అంటే రూ.68కు విక్రయిస్తున్నారు. ఇక దాణా సరఫరా చేసేవారికి, కోళ్లను కొనుగోలు చేసే ట్రేడర్లకు, చికెన్‌ను విక్రయించే చికెన్ సెంటర్లకు మాత్రం లాభాలు చేకూరుతున్నాయి.

చికెన్ సెంటర్లలో రేటు ఎక్కువే..

ప్రస్తుతం కోడి ధర భారీగా తగ్గినా చికెన్ సెంటర్లలో మాత్రం రేటు తగ్గించడం లేదు. పేపర్ ప్రకారం.. చికెన్ రేట్లు ప్రస్తుతం స్కిన్‌లెస్ కిలో రూ.165 ఉండగా డ్రెస్‌డ్ రూ.145 ఉండగా చికెన్ సెంటర్ల నిర్వాహకులు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. కిలోపై రూ.40 నుంచి రూ.50 వరకు పేపర్ రేట్ కంటే అదనంగా తీసుకుంటున్నారు.



ఫారంలో పెరుగుతున్న కోళ్లు

పదవులు కేసీఆర్ కుటుంబానికి.. అప్పులు ప్రజలకు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ




మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని అన్ని పదవులు కల్వకుంట్ల కుటుంబానికి దక్కుతున్నాయని, ప్రజలకు మాత్రం అప్పులు మిగులుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. ఆదివారం నగరంలోని నాగారం 9వ డివిజన్‌లో ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలోభాగంగా శక్తికేంద్రాల కార్నర్ మీటింగ్ సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు నాగారంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ.లక్షకుపైచిలుకు అప్పులు చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఉద్యోగాలు రాకపోయినా.. కల్వకుంట్ల కుటుంబంలో మాత్రం అందరికీ పదవులు వచ్చాయన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, రాష్ట్ర ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. అర్బన్‌లో ఎమ్మెల్యే గణేశ్ గుప్తా అభివృద్ధి పేరుతో రూ.కోట్లు దోచుకుంటున్నారని, యూజీడీ, డబుల్ ఇండ్లు, రోడ్లు, డ్రెయినేజీ, ఇతర ఏ పనులు చేపట్టడం లేదన్నారు. కార్పొరేషన్‌ను పూర్తిగా అవినీతిమయం చేశారని ఆరోపించారు. మేక సంతోష్, అడ్లూరి శ్రీనివాస్, కోడూరి నాగరాజ్, లక్ష్మీనారాయణ, రాగి నారాయణ యాదవ్, పుట్ట వీరేందర్ పాల్గొన్నారు.

పండుగ వేళ ఆర్టీసీ దోపిడీ

- మద్దికుంట బుగ్గ నుంచి రామారెడ్డి టికెట్ రూ.40
- ఆగ్రహం వ్యక్తం చేసిన భక్తులు



గుడి నుంచి మద్దికుంట క్రాస్ రోడ్డు వరకు టికెట్

రామారెడ్డి: శివరాత్రి పండుగ వేళ ఆర్టీసీ వారు భక్తులను నిలువు దోపిడీ చేశారు. రామారెడ్డి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ స్వయంభు బుగ్గరామలింగేశ్వరుడి ఆలయానికి మహాశివరాత్రి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఇదే అదునుగా ఆర్టీసీ భక్తుల ముక్కు పిండి ఛార్జీలను వసూలు చేసింది. మద్దికుంట బుగ్గ నుంచి మద్దికుంట మర్రి వరకు 5 కిలో మీటర్ల దూరం ఉంటుంది. మాములు రోజుల్లో రూ.10 నుంచి రూ.20 వరకు ఛార్జీ వేస్తారు. పండగ వేళ ఏకంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన వారికి మద్దికుంట మర్రి వరకు రూ.40 ఛార్జీ చేశారు. అలాగే రామారెడ్డి వరకు ఇసన్నపల్లి మీదుగా వస్తే 8 కిలో మీటర్ల దూరం వస్తుంది. అదే బుగ్గ నుంచి మద్దికుంట మర్రి మీదుగా ప్రయాణిస్తే రామారెడ్డి వరకు 10 కిలో మీటర్ల దూరం వస్తుంది. ఆటోలు కూడా రూ.20 తీసుకోగా, ఆర్టీసీ బస్సులు మాత్రం రూ.40 ఛార్జీ చేశారు. దీనిపై రామారెడ్డికి చెందిన కొందరు భక్తులు కండక్టర్ నిలదీశారు. ఆర్టీసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

లొంక దారిలో ట్రాఫిక్ జామ్



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు



ట్రాఫిక్ జామ్ కావడంతో నడిచి వెళ్తున్న భక్తులు

సిరికొండ: మండలంలోని లొంకకు ఆదివారం భక్తులు పోటెత్తడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. భక్తులు భారీగా రావడంతో దారిలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తీవ్రంగా శ్రమించారు. ఆరు గంటల వరకు ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు ముందుకు కదిలే పరిస్థితి లేకపోవడంతో భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి.

ఈ ఇసుక దారెటు?

- వేలం వేస్తారా.. వదిలేస్తారా..
- 100కుపైగా ట్రాక్టర్‌ల ఇసుక సీజ్



అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపు

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో నాలుగు రోజుల క్రితం ఇసుక డంపులను సంబంధిత అధికారులు సీజ్ చేశారు. ఈ ఇసుకను వేలం వేసి ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉంది. అయితే ఇసుక డంపు వద్ద రెండు రోజుల పాటు కాపలగా రెవెన్యూ సిబ్బంది మానేయడంతో ప్రజల్లో గుసగుసలు వెల్లువెత్తుతున్నాయి. బీర్కూర్ మండలంలోని మంజీర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను, ఇసుక డంపులను అధికారులు పట్టుకున్నారు. అందులో భాగంగానే బాన్సువాడ పోలీసులు 19, బీర్కూర్ పోలీసులు 4 ట్రాక్టర్‌లను అంతే కాకుండా ఇసుక నిల్వ చేసిన డంపులను సీజ్ చేసి సున్నం పోశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తూతూ మంత్రంగా వాహనాలను ఇసుకను అధికారులు పట్టుకున్నారు. కానీ ఎక్కువ మొత్తం ఇసుక ఉండగా కూడా సంబంధిత వ్యక్తులు చెప్పిన మేరకు ఇసుక కుప్పలకు చలాన్ రాసి వదిలేస్తున్నారంటు ఆరోపణలు ఉన్నాయి. వందకు పైగా ట్రిప్పుల ఇసుక ఉండగా 50లోపు మాత్రమే ఫైన్ వేశారంటు గుసగుసలు వినిపిస్తున్నాయి. వాహనాలకు అధికారికంగా ఫైన్‌లను విధించి డంపులను మాత్రం గుట్టు చప్పుడు కాకుండా మాయం చేయడానికి అధికారులు సహకరిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

క్రైం కార్నర్

నాణేల కోసం వెళ్లి..

గోదావరిలో మునిగి ఒకరి మృతి

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ కాలనీకి చెందిన మూస(32) గోదావరిలో భక్తులు వేసే నాణేల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మెండోరా ఏఎస్సై మురళిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపాడ్ వద్ద గల గోదావరిలో భక్తులు స్నానాలకు వచ్చి చిల్లర నాణేలు వేస్తుంటారు. ఆ నాణేలను కొందరు అయస్కాంతం సాయంతో తీసుకుంటారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గోదావరిలోకి వెళ్లి శనివారం నీట మునిగాడు. గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం మధ్యాహ్నం మృత దేహం లభించింది. మృతుడి భార్య రేహన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్దా గ్రామానికి చెందిన సుంకరి లచ్చన్న(52) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న లచ్చన్న ఈనెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..



రాములు(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ధర్పల్లి గ్రామానికి చెందిన పానేటి రాములు(37) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. లూనాను కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాముల భార్య సత్తవ్వ అదే రోజు మృతి చెందగా, వీరి కూతురు ప్రియకు కాలు విరిగింది. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన ప్రియ అనాథగా మారింది.

కారు బోల్తా



సిరికొండ: మండలంలోని గడ్కోల్ సమీపంలో మూలమలుపు వద్ద అడవి పందులు అడ్డురావడంతో శనివారం అర్ధరాత్రి కారు బోల్తా పడింది. కారులోని వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సిరికొండకు చెందిన సాగర్‌రెడ్డి కారులో ఇందల్‌వాయి నుంచి వస్తుండగా మలుపు వద్ద అడవి పందులు అడ్డువచ్చాయి. సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కారు రోడ్డు పక్కన ఉన్న మొక్కజొన్న తోటలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాగర్‌రెడ్డి భుజానికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై నర్సింలు ఘటన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు.

మహిళ అదృశ్యం

ఖలీల్‌వాడీ: నిజామాబాద్ గౌతంనగర్ స్వదరం హోమ్ నుంచి పాసులోటి సబిత అనే మహిళ, తన నాలుగేళ్ల కొడుకుతో పాటు కన్పించకుండా పోయినట్లు మూడో టౌన్ ఎస్సై శ్రావణ్ తెలిపారు. వివరాలు.. ఒక కేసులో నిందితురాలైన సబిత, ఆమె కొడుకును పాటు కామారెడ్డి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సూచన మేరకు గత నవంబర్ 15న డిస్ట్రిక్ట్ చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ కమిటీ వారు స్వదరం హోమ్‌కు అప్పగించారు. ఈ నెల 17న తన కొడుకును అంగన్‌వాడీ సెంటర్‌లో అప్పగించి వస్తానని చెప్పి స్వదర్ హోమ్ నుంచి వెళ్లిన సబిత తిరిగి రాలేదు. దీంతో హోమ్ సూపరింటెండెంట్ శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.